సాక్షి తిరుపతి

గురువారం । 21 । మార్చి । 2024



కనపడని 'కోడ్'

తిరుపతిలోని టీడీపీ నేతలు ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. నేతల ఫొటోలు, బొమ్మలు ప్రదర్శిస్తున్నారు. - 8లో



బెంచీల ధ్వంసంపై ఫిర్యాదు

తిరుపతి రూరల్ మండలంలో కొందరు దుండగులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బెంచీలను ధ్వంసం చేశారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6-27	4-57
గూడూరు	6-22	4-53

న్యూస్‌రీల్

ఇంగ్లిష్ పరీక్షకు 371 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా 162 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 371 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. మొత్తం 26,941మంది విద్యార్థులకు గాను 26,570 మంది హాజరైనట్లు వివరించారు. 22వ తేదీ శుక్రవారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు మ్యాథ్స్ పరీక్ష ఉంటుదని వెల్లడించారు.

ఎస్వీ జూలో పిచ్చుకల దినోత్సవం



పిచ్చుక బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణంలో పిచ్చుకల ప్రాధాన్యత, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు పిచ్చుకల బొమ్మలను చిత్రించారు. ప్రతిభ కనబరచిన పిల్లలను సీసీఎఫ్ నాగభూషణం, జూ క్యూరేటర్ సెల్వం, సైన్స్ సెంటర్ ఎడ్యుకేషన్ అధికారి అభినందించారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద హుండీలను లెక్కించారు. మొత్తం 37 రోజులకు గాను హుండీ ద్వారా స్వామి, అమ్మవార్లకు కానుకల రూపంలో రూ.2,10,62,681 వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే 128 గ్రాముల బంగారం. 592.350 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు.

'అమరరాజా'కు జపాన్ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అమరరాజా కంపెనీ ప్రతినిధులు

రేణిగుంట: ఎనర్జీ అండ్ మొబిలిటీ రంగంలో రేణిగుంట మండలం కరకంబాడిలోని అమరరాజా బ్యాటరీస్ లిమిటెడ్‌కు విశిష్ట పురస్కారం దక్కింది. బుధవారం జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది.కంపెనీ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ నరసింహులునాయుడు, శ్రీనివాసరావు, మునీశ్వరనాయుడు, సుభాష్ ఈ అవార్డును అందుకున్నారు. కంపెనీ చైర్మన్ గల్లా జయదేవ్, ఈడీ గౌరినేని హర్షవర్ధన్ అభినందనలు తెలిపారు.



భావి తరాల భవిష్యత్‌ను నిర్దేశించడంలో ఓటు ప్రధాన భూమిక పోషిస్తుంది. దేశాభివృద్ధి.. సంక్షేమానికి బాటలు వేస్తుంది. అందుకే పౌరులకు రాజ్యాంగం ఈ విశిష్ట హక్కును కల్పించింది. ప్రతి ఎన్నికల్లో యువత ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఫలితాల సరళిని ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం సైతం యవతరానికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటు హక్కు పొందాలని పిలుపునిస్తోంది. ఈ మేరకు జిల్లాలో కొత్తగా వేలాది మంది నవ ఓటర్లు నమోదయ్యారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ హక్కు వినియోగించుకునేందుకు ఉత్సుకతతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తమ భవితకు భరోసా కల్పించే నేతకు అండగా నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు.



యువత.. ఓటే భవిత

- జిల్లాలో 30,506 మంది కొత్త ఓటర్లు
- అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గంలో 6,275 మంది
- అత్యల్పంగా సత్యవేడులో 3,428 మంది
- పోలింగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న యువతరం
- ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయనున్న నవ ఓటర్లు

తిరుపతి సిటీ/అర్బన్: జిల్లావ్యాప్తంగా యువత భారీ సంఖ్యలో ఓటు హక్కు పొందారు. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో 18 నుంచి 19 ఏళ్ల యువతీయువకులు ఇప్పటి వరకు 30,506మంది నూతన ఓటర్లుగా నమోదయ్యారు. అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గంలో 6,275మంది, అత్యల్పంగా సత్యవేడులో 3,428మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. మే 13వ తేదీన పోలింగ్ రోజు ఓటు వేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

జిల్లాలోని యువ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	యువకులు	యువతులు	ఇతరులు	మొత్తం ఓటర్లు
గూడూరు	2,098	1,688	0	3,786
సూళ్లూరుపేట	1,997	1,613	0	3,610
వెంకటగిరి	1,976	1,565	0	3,541
చంద్రగిరి	3,401	2,873	1	6,275
తిరుపతి	2,630	2,235	1	4,866
శ్రీకాళహస్తి	2,731	2,269	0	5,000
సత్యవేడు	1,887	1,541	0	3,428
మొత్తం	16,720	13,784	2	30,506

ఆత్రుతగా ఎదురుచూస్తున్నా



రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా. పోలింగ్ రోజు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నా. ఇప్పటికే ఓటు వేయడంపై అవగాహన వచ్చింది. తొలి ఓటును ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవాలని సంకల్పించా. తద్వారా రాష్ట్రాభివృద్ధికి నా వంతు పాత్ర పోషిస్తా. – ప్రసన్న కిషోర్, బీటెక్ విద్యార్థి, కొర్లగుంట, తిరుపతి

నిబద్ధతతో ఓటేస్తాం



నూతనంగా ఓటు హక్కు పొందా. రాబోయే ఎన్నికల్లో నిబద్ధతతో ఓటేస్తా. ఎలాంటి ప్రలోభాలకు లొంగను. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే అభ్యర్థికే మద్దతుగా నిలబడతా. డబ్బులు తీసుకుని ఓటేయవద్దని మా చుట్టపక్కల వారికి సైతం అవగాహన కల్పిస్తా.

– ఎస్.యమున, డిగ్రీ విద్యార్థిని, తిరుపతి

గర్వంగా ఉంది



రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కు నాకు ఈ ఏడాది జనవరిలో వచ్చింది. తొలి సారి ఓటేస్తున్నా అనుకుంటేనే గర్వంగా, సంతోషంగా ఉంది. యువత భవిష్యత్‌కు భరోసా కల్పించే నాయకుడికే ఓటు వేస్తా. విద్య, ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేసేవారికి అండగా నిలవాలి. రాజకీయాలపై యువత స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలి. – ఎస్ యుదేష్ణ, బీటెక్, అన్నమాచార్య కళాశాల, కరకంబాడి, తిరుపతి

విధిగా ఓటేయాలి



రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధమే ఓటు . మన జీవితాలలో వెలుగు నింపి, దేశ, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే వ్యక్తికి ఓటు వేయాలి. విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, యువతకు ఉద్యోగవకాశాలను కల్పించే నాయకత్వాన్ని ఎన్నుకుకోవాలి. యువత విధిగా ఓటేయాలి. చుట్టు పక్కల వారికి కూడా ఓటు విలువను తెలియజేయాలి.

– నాగశ్రీ, బీసీఏ విద్యార్థిని, పుత్తూరు

పది మందికి చెబుతా



ఓటు హక్కు వినియోగించుకోవడం దేశ పౌరులుగా మన కర్తవ్యం. ఈ విషయాన్ని పది మందికీ చెబుతా. అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా నా వంతు కృషి చేస్తా. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటేయబోతున్నా. దేశ, రాష్ట్ర భవిష్యత్ నిర్దేశంలో నేను కూడా భాగస్వామిని కాబోతున్నా. నాకు చాలా ఆనందంగా ఉంది.

– మనోహర్‌రెడ్డి, డిగ్రీ విద్యార్థి, చంద్రగిరి

సంతోషంగా ఉంది



తొలి సారి ఓటు హక్కు పొందడం సంతోషంగా ఉంది. యువత ఓటు హక్కును దేశ అభివృద్ధి కోసం వినియోగించాలి. తాయిలాలకు లొంగకుండా పేద ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలి. గ్రామీణ ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై చైతన్యవంతులను చేయాలి. తొలి ఓటు వేసేందుకు పోలింగ్ తేదీ కోసం ఎదురు చూస్తున్నా. ఓటింగ్ శాతం పెరిగినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కుకు విలువ ఉంటుంది. – డాక్టర్ కె.ఆషా, ఏర్పేడు మండలం, శ్రీకాళహస్తి

జీవితంలో గుర్తుండిపోతుంది



ఓటు హక్కు కోసం 18 ఏళ్లు పూర్తి అవగానే దరఖాస్తు చేశా. ఓటు హక్కు లభించింది. తొలి ఓటు వేయడం జీవితంలో చిరస్థాయిగా గుర్తుండిపోతుంది. మన భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు. అర్హుడైన నాయకుడిని ఎంపిక చేసుకుని ఓటేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పేదలు సైతం ఉన్నతంగా చదువుకునే పరిస్థితి వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుంది.

– లక్ష్మీప్రియ, డిగ్రీ విద్యార్థిని, పేరూరు, చంద్రగిరి

అవగాహన అవసరం



నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ఓటు ప్రాధాన్యత తెలుసుకోవాలి. వినియోగంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి. ఇతరులకు తమ బాధ్యతగా ఓటు హక్కుపై చైతన్యం కల్పించాలి. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు యువత కృషి చేయాలి. హక్కును దుర్వినియోగం చేయకుండా తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఓటేయాలి. ఇప్పటికీ ఓటు హక్కు పొందని 18 ఏళ్లు నిండిన వారు వెంటనే ఆన్‌లైన్ లేదా, సమీపంలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

– లక్ష్మీశ, కలెక్టర్, తిరుపతి

ధన్యోస్మి



తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు బుధవారం టీటీడీ అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టింది.. సీతా లక్ష్మణ సమేత నీలమేఘశ్యాముని దివ్యతేజస్సుని దర్శించి భక్తకోటి పులకించింది..పుష్కరిణిలో తెప్పలపై కొలువుదీరిన ఆదర్శమూర్తులను సేవించి తన్మయత్వం చెందింది.. జల విహారం చేస్తున్న కోదండపాణి కరుణాకటాక్ష వీక్షణాలు స్పృశించడంతో తరించింది. – తిరుమల

నిబంధనలు ఉల్లంఘిస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరైనా సహించే ప్రసక్తే లేదని కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ టైం లైన్ చార్ట్‌తోపాటు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను ఆకళింపు చేసుకోవాలని సూచించారు. సి-విజిల్‌లో అందిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, ఓటర్లను ప్రభావితం చేసే పలు రకాల వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్ పోస్టులను వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ కులశేఖర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

రేణిగుంట : రేణిగుంట పాత విమానాశ్రయ మార్గంలోని ఈవీఎం గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ లక్ష్మీ శ తనిఖీ చేశారు. నిరంతరం పటిష్ట నిఘా, భద్రత కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి.. సంక్షేమం



కందాడులో నేతలు, గ్రామస్తులతో ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు : వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమ పథకాల అమలు సాధ్యమని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని కందాడులో అంకమ్మ తల్లి, చిందేపల్లె అంకమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు పొత్తుల కూటమితో వస్తున్నారని ఆరోపించారు. అయితే బాబు మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే ఎన్నికల్లో మళ్లీ ఫ్యాను గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే కందాడు అంకమ్మ ఆలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు ఆకర్ష్‌రెడ్డి పూజలు చేశారు. అంకమ్మ శక్తి రాళ్ల ఏర్పాటులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్ పెంచలయ్య, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పారి నాగరాజు, యల్లయ్య, లోకనాథరెడ్డి, రాంబత్తెయ్య, గురునాధం, కేశవులురెడ్డి, కమలాకర్‌రెడ్డి, శేఖర్ రాజు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు సత్యవేడులో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

- పిచ్చాటూరులో బహిరంగ సభ

పిచ్చాటూరు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి శుక్రవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ తెలిపారు. బుధవారం పిచ్చాటూరు పీడీబ్ల్యూడీ మైదానంలో పెద్దిరెడ్డి సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ గురుమూర్తి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు నారాయణవనంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారన్నారు. 9 గంటలకు నారాయణవనం, 10.30కి కేవీబీ పురం, 11.30 గంటలకు పిచ్చాటూరులో బహిరంగ సభలో పాల్గొంటారని వెల్లడించారు మధ్యాహ్నం ఒంటి గంటకు నాగలాపురం, 2.30 గంటలకు సత్యవేడు. సాయంత్రం 4 గంటలకు వరదయ్యపాలెం, 5.30 గంటలకు బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని వివరించారు. మంత్రి పెద్దిరెడ్డి పాల్గొననున్న సమావేశాలకు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రావు, వైఎస్సార్ టీయూసీ మండల అధ్యక్షుడు మునిరాజా, సర్పంచ్ సతీష్, కో–ఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, నాయకులు సురాజ్ ఆనంద్, భానుప్రకాష్ రెడ్డి, మురళీనాయుడు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న నూకతోటి రాజేష్ తదితరులు

గోదాములో అగ్ని ప్రమాదం


దగ్ధమవుతున్న గోదాము

శ్రీకాళహస్తి: పట్టణంలోని బైపాస్‌రోడ్డు పక్కన శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజస్ గోదాములో బుధవారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు గుర్తించి గోదాము యజమాని జయరామ్‌కు సమాచారం అందించారు. ఆయన తిరువణ్ణామలైలో ఉండడంతో బంధువులకు విషయం తెలపాడు. వారు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. అయితే గోదాములో థమ్సప్ పరిశ్రమకు చెందిన వ్యర్థాలు, బాటిలింగ్ క్లీనింగ్ ప్లాంటుకు సంబంధించిన ప్లాస్టిక్, ఎస్ఎస్ ఐరన్ వస్తువులకు మంటలు అంటుకోవడంతో అదుపు కాలేదు. పక్కనే ఉన్న ట్రాక్టర్, ట్రాలీ కూడా అగ్నికీలల్లో చిక్కుకుని మొత్తం కాలిబూడిదగా మారాయి. జిల్లా అగ్నిమాపక అధికారి జె.రమణయ్య ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గోదాము యజమాని జయరామ్‌ను ఫోన్‌లో సంప్రదించగా రూ.1.25 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ మేరకు ఇన్‌వాయిస్‌లను అగ్నిమాపక అధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

ధైర్యం లేకే బాబు పొత్తులు


టీడీపీ నేతలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య


పెళ్లకూరు : పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

నాయుడుపేటటౌన్ : సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేకే చంద్రబాబు పొత్తులతో కూటమి కట్టారని వైఎస్సార్‌సీపీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని 14, 16 వార్డులకు చెందిన టీడీపీ ముస్లిం నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మొత్తం 200 ముస్లిం కుటుంబాల వారికి ఎమ్మెల్యే సంజీవయ్య కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. బూటకపు హామీలతో చంద్రబాబు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని ఆరోపించారు. 45 ఏళ్ల అనుభవం అంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఇప్పుడు జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను కాపీ కొడుతున్నారని విమర్శించారు.

జగనన్న పక్షానే జనం

పెళ్లకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షానే ప్రజలు ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. బుధవారం రాత్రి చిల్లకూరులోని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసం వద్ద సుమారు 120మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓటమి భయంతోనే చంద్రబాబు జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుని అసత్యాలతో ప్రచారం చేపట్టారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మొత్త 175 స్థానాలను ప్రజలలే జగనన్నకు బహుమతిగా అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, లింగమనాయుడు, హరిబాబురెడ్డి, చంద్రశేఖరెడ్డి, అంకయ్య, చంద్రయ్యనాయుడు, రమణారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనకు అండగా మహిళలు సైతం స్వచ్ఛందంగా పార్టీలో చేరడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, మధుసూదన్, నాయకులు కలికి మాధవ రెడ్డి, కోండూరు రామకృష్ణమరాజు, కటకం జయరామయ్య, నాగిరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, గంధవళ్లి సిద్ధయ్య. షేక్ షబ్బీర్, పాలేటి నాగార్జున, రత్నశ్రీ, లింగారెడ్డి సురేష్ రెడ్డి, భరత్, భవాన్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 9 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాం ప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,251 మంది స్వామివారిని దర్శించుకోగా, 20,989 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టోక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పిచ్చాటూరు : మండలంలోని కీళపూడి కోళ్లఫారమ్ వద్ద బుధవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలు.. విశ్రాంత ఆర్మీ జవాన్ తంగవేల్ రెడ్డి(55) పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో నివసిస్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై పుత్తూరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

టీడీపీ రెబల్‌గా జేడీఆర్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న జేడీ రాజశేఖర్

సత్యవేడు: టీడీపీ రెబల్ అభ్యర్థిగా ప్రకటించుకుని జేడీ రాజశేఖర్ బుధవారం మండలంలోని ఆరూరు పంచాయతీలో ప్రచారం చేపట్టారు. నేతలు, కార్యకర్తలను కలిసి మద్దతు కోరారు. భార్య సుగుణమ్మ, కుమార్తెలు మౌనిక, మేఘన, టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో శివయ్యశెట్టి, రాధయ్య, లోకయ్య రెడ్డి, పి.వాసు, హేమభూషణం పాల్గొన్నారు.

బాణసంచా పేలుడు ఘటనలో ఇద్దరి మృతి

సూళ్లూరుపేట : పట్టణంలోని ఏషియన్ హైవే పక్కన బాణసంచా గోదాము వద్ద మంగళవారం సంభవించిన పేలుడు ఘటనలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని కేఎంసీ ఆస్పత్రికి తరలించిన విషయం విధితమే. ఈ క్రమంలో బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్ (18), రవి (21) బుధవారం రాత్రి మరణించారు. మరొకరి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్లు ఎస్ఐ రహీమ్‌రెడ్డి తెలిపారు. చెన్నైలోనే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాలను అప్పగించనున్నట్లు వివరించారు.

కనపడని 'కోడ్'..!


ఆటోనగర్‌లోని తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ కార్యాలయం


మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇంటికి టీడీపీ, జనసేన జెండాలు



కపిలతీర్థం సర్కిల్ వద్ద టీడీపీ ఆఫీస్

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా టీడీపీ నేతలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇళ్లు.. కార్యాలయాల వద్ద బోర్డులు.. హోర్డింగులు.. జెండాలను ఉంచేశారు. ముఖ్యంగా కపిలతీర్థం సర్కిల్‌లోని టీడీపీ ఆఫీస్ వద్ద నాయకులు.. పార్టీ గుర్తును తొలగించకుండా అలాగే వదిలేశారు. ఈ క్రమంలోనే ఆటోనగర్‌లోని మాజీ తుడా చైర్మన్ నరసింహయాదవ్ కార్యాలయం వద్ద సైతం ఇదే చిత్రాలు దర్శనమిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసానికి సైతం కూటమి జెండాలు కనిపిస్తున్నాయి. వీటిని గమనించిన తిరుపతి ప్రజలు టీడీపీ వారికి మాత్రం ఎన్నికల కోడ్ వర్తించదా అంటూ చర్చించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

బెంచీల ధ్వంసంపై ఫిర్యాదు


గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన బెంచీ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలో కొందరు దుండగులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. స్థానికులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన 10 సిట్టింగ్ బెంచీలను పగులగొట్టేశారు. సీసీ రోడ్లకు వేసిన సూచిక బోర్డులను కూడా విరిచేశారు. వీరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం ఈ మేరకు సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతల తీరుపై ప్రజల అసహనం


టీడీపీ నేతలతో ఆదిమూలం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని టీడీపీ నేతల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలాన్ని ప్రకటించడంపై 4 రోజులుగా నియోజకవర్గంలోని 7 మండలాల్లో తమ్ముళ్లు నిరసనలు వ్యక్తం చేశారు. ఒకప్పుడు తమపై కేసులు బనాయించి ముప్పతిప్పలు పెట్టిన ఆదిమూలం వెంట ఎలా నడవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సత్యవేడు, వరదయ్యపాళెం, కేవీబీపురం, పిచ్చాటూరు మండలాల్లో అసమ్మతి గళం వినిపించిన నేతల ఇళ్లకు ఆదిమూలం వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. అదీ కేవలం సంపన్న వర్గాల్లోని నేతల ఇళ్లకే వెళ్లి ఆదిమూలం సంప్రదింపు జరుపుతుండడంపై బలహీన వర్గాలకు చెందిన నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడుగులు ఆయన కంటికి కనపడడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న నియోజకవర్గ ప్రజలు రోజుకోవిధంగా రంగులు మారుస్తున్న టీడీపీ నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్ట్ వర్క్ పేరుతో ప్రచారం

- నారాయణ విద్యాసంస్థల నిర్వాకం
- అడ్డుకున్న గ్రామస్తులు



విద్యార్థులను తీసుకుని వచ్చిన కళాశాల బస్సు

చిల్లకూరు : ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్య పెట్టేందుకు టీడీపీ నేతలు వివిధ పన్నాగాలు పన్నుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు విఫలయత్నం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. చదువుకునే పిల్లలకు సంక్షేమ పథకాలతో పనేంటని గ్రామస్తులు ప్రశ్నించడంతో వారు నీళ్ల నమిలారు. తమకు ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారని, అందులో భాగంగానే ఈ వివరాలు అడిగామని బుకాయించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇలా ప్రాజెక్ట్ వర్క్ పేరుతో ప్రచారం చేయడం సరికాదని స్పష్టం చేశారు. మళ్లీ ఇలాంటి కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో వచ్చిన బస్సులోనే విద్యార్థులు, అధ్యాపకులు తిరుగుప్రయాణమయ్యారు. నారాయణ విద్యాసంస్థల అధినేత నెల్లూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున ఆయన ఆదేశాల మేరకే ఎక్కడెక్కడ నారాయణ కాలేజీలు ఉన్నాయో అక్కడ విద్యార్థులతో పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేయిస్తున్నట్లు తెలిసింది. ఫీజుల కింద రూ.లక్షలు చెల్లిస్తే తమ పిల్లలతో ఇలాంటి పనులు చేయించడంపై తల్లిదండ్రులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డేటా సైన్స్ సెంటర్ ప్రారంభం


సైన్స్ సెంటర్ ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

తిరుపతి సిటీ: స్థానిక తుమ్మలగుంటలోని నలందానగర్‌లో ఏర్పాటుచేసిన డేటా సైన్స్ సెంటర్‌ను బుధవారం విర్చోవ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లోనూ డేటా సైన్స్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. డేటా సైన్స్ సెంటర్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించానని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్ సంస్థ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి, కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, సెక్రటరీ కే చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

ఆదిమూలానికి అసమ్మతి సెగ


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు


కరపత్రాల బ్యాగ్ ఇచ్చేస్తున్న భాస్కర్‌యాదవ్

బుచ్చినాయుడుకండ్రిగ: సత్యవేడు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థిగా ఆదిమూలానికి సహకరించే ప్రసక్తే లేదని టీడీపీ నేతలు, కార్యకర్తలు స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు టీడీపీ మండల మహిళా అధ్యక్షులు ఉషారాణి, ఉపాధ్యక్షుడు మునిరాజా, నియోజక వర్గ సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ మునిసుబ్బయ్య, నాయకులు శేషయ్య, భద్రి, రాము, సుబ్బారావు విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా కొనసాగుతూ, టీడీపీలో ఇప్పటి వరకు చేరని ఆదిమూలానికి చంద్రబాబు టికెట్ ఇవ్వడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులను తీవ్రంగా ఇబ్బంది పెట్టడడమే కాకుండా, వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆదిమూలానికి ఓటేయాలని ఎలా ప్రచారం చేయగలమని వాపోయారు. ఇప్పటికైనా టీడీపీ అధిష్టానం స్పందించి పార్టీ కోసం కష్టపడిన వారికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే టీడీపీ తిరుపతి పార్లమెంట్ రైతు విభాగం కార్యదర్శి భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పక్కనపెట్టిన ఆదిమూలాన్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం దారుణమని కన్నీరుమున్నీరయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదిమూలానికి మద్దతుగా ప్రచారం చేయలేమని, కరపత్రాలను సైతం టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడుకు అప్పగించేశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- యువకుడి మృతి, మరో ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్ : స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో ఉల్లాసంగా.... ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆత్మీయుల మధ్య ఆటపాటలతో సందడి చేశారు...ఎన్నో జ్ఞాపకాలను వెంటేసుకుని వెనుదిరిగారు. అసలే జాతీయ రహదారి..అర్ధరాత్రి ...ఆపై అతివేగంతో కారు దూసుకెళుతోంది. కంటి మీదకు చిన్న కునుకు రావడంతో కారు అదుపుతప్పింది. డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన మంగళవారం రాత్రి తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేంద్రబాబు కథనం మేరకు..తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురానికి చెందిన తమ్మినేని నాగిరెడ్డి(19) బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాడు. తన మిత్రుడు ప్రీతమ్ పుట్టిన రోజు కావడంతో మంగళవారం రాత్రి తన స్నేహితులు నాగిరెడ్డి, మనోజ్, బద్రీతో కలిసి తన కారులో చంద్రగిరి మండలం ఐతేపల్లె సమీపంలోని దాబాకు డిన్నర్ చేసేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రామానుజపల్లె చెక్‌పోస్ట్ దాటిన తర్వాత ప్రీతమ్ డ్రైవింగ్ చేస్తున్న అతివేగం కారణంగా డివైడర్‌ను ఢీకొంది. దీంతో నాగిరెడ్డి తలకు తీవ్రమైన గాయం కావడంతో మరణించాడు. ప్రీతం, మనోజ్, బద్రీని స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తేజారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీఐజీకి స్వాగతం


తిరుపతి నగరంలోని పోలీసు అతిథిగృహం వద్ద అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్.

– తిరుపతి క్రైం